క్లుప్తంగా

నేడు వారపు సంత బహిరంగ వేలం

బంగారుపాళెం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం వారపు సంత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో దిన, వారపు సంతకు సంబంధించి ఏడాది పాటు గేటు వసూలు చేసుకునేందుకు బహిరంగ వేలం చేపట్టినట్లు వివరించారు. ఇతర వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

ఇంటి వద్దనే వైద్య సేవలు



ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ఇంటి వద్దనే వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డాక్టర్ సంధ్య చెప్పారు. మండలంలోని పశుమందలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంధ్య ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానికులకు వైద్యసేవలు అందించారు. అనంతరం మంచాన పడ్డ రోగులకు ఇళ్లవద్దకే వెళ్లి చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది జబసెల్వి, ఉమామహేశ్వరి, సుజిమ, చంద్ర, పంకజ పాల్గొన్నారు.

చిత్తూరులో ఫ్లెక్సీల తొలగింపు

చిత్తూరు అర్బన్: ఎన్నికల నియమావళి రానున్న నేపథ్యంలో చిత్తూరు నగరంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కార్పొరేషన్ యంత్రాంగం నగరంలోని పలు ప్రధాన కూడళ్లల్లో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలను తొలగించారు. విద్యుత్ స్తంభాలు, నివాస స్థలాలపై రాసిన రాజకీయ పార్టీల ప్రచారాన్ని రంగులతో మూసేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనే సమాచారంతో శనివారం అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకున్నారు.

వేలం పాటతో రూ.లక్ష ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ అధికారులు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి వేలంపాట ద్వారా రూ.1.05,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి తెలిపారు. అర్ధగిరి క్షేత్రంలో శుక్రవారం క్యాంటీన్ నిర్వహణ, పాదరక్షలు నిల్వ ఉంచడం, తలనీలాలు పోగుచేయడం, కొబ్బరి చిప్పలు పోగుచేయడానికి ఆలయ ఈఓ హనుమంతరావు, పలమనేరు గ్రూపు దేవాలయాల ఈఓ కమలాకర్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. క్యాంటీన్ నిర్వహణలో ఏడాదికి అధిక వేలం పాట పాడడంతో రూ.90 వేలు, పాదరక్షలు నిల్వ ఉంచడానికి ఏడాదికి రూ.15,500 చొప్పున ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసే వేలం పాట వాయిదా పడిందని ఈ నెల 27న తిరిగి వేలం పాట నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వేలం పాటదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష పేదలకు వరం



ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని గాజులపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. వైద్య శిబిరంలో ఆర్థో నిపుణులు డాక్టర్ అఖిల్, జనరల్ మెడిసిన్ డాక్టర్ అఖిలేష్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ హరి బృందం 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 14 మందిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

20న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం మార్చి 20వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతోపాటు, పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను ఉదయం 7గంటల నుంచి లెక్కించనున్నట్లు చెప్పారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఇంటి ముంగిటకు రేషన్

- నియోజకవర్గంలో 82,704 కార్డులు
- గ్రామాలకు 52 వాహనాల్లో పంపిణీ
- పేదల ఇంటి వద్దకే నిత్యావసరాలు

బంగారుపాళెం: రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పనిలేదు. కిలోమీటర్ల దూరం నడవాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇంటి వద్దకే రేషన్ వస్తోంది. గతంలో బియ్యం తీసుకోవాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సివచ్చేది. సరుకుల కోసం వెళితే డీలరు అందుబాటులో ఉండేవారు కాదు. రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. తూకంలో మోసం సరేసరి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి గడప వద్దకే రేషన్ సరకులు అందించడానికి ఎండీయూ ఆపరేటర్లను నియమించారు. వారికి వాహనాలు అందజేశారు. నియోజకవర్గంలో 234 రేషన్ షాపుల్లో 82,704 రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా వీరికి 52 వాహనాల్లో ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. తూకాల్లో మోసానికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. జీపీఎస్, రేషన్‌కార్డు మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి ప్రజలకు సరకులు అందిస్తున్నారు. జీపీఎస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారులు ఏ రేషన్ షాప్ పరిధిలో ఉన్నా.. నివసించే ప్రాంతంలోని చౌకదుకాణం నుంచే పోర్టబులిటీ ద్వారా రేషన్ తీసుకోవచ్చు. వేరే ప్రాంతానికి వెళ్తే, ఆ ప్రాంత వలంటీరుకు సమాచారం ఇచ్చి జీపీఎస్ మ్యాపింగ్ చేసుకుంటే చాలు. గడప దాటకుండానే నెల ఆరంభంలోనే ఒకటో తేదీ నుంచి 17 తేదీలోగా సరకులు అందిస్తున్నారు. ఏ రోజు ఏ వీధిలో ఎవరి ఇళ్ల వద్దకు ఎన్ని గంటలకు రేషన్ డెలివరీ వాహనం వస్తుందో ముందస్తు సమాచారం ఇస్తున్నారు. కుటుంబంలో ఒకరుంటే చాలు సరకులు అందజేస్తున్నారు. లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రేషన్ పంపిణీ తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్



రేషన్ పంపిణీ తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్

నియోజకవర్గంలో మండలాల వారీగా షాప్‌లు, కార్డులు, వాహనాల వివరాలు

మండలం	షాప్‌లు	కార్డులు	వాహనాలు
బంగారుపాళెం	56	22,492	14
ఐరాల	45	15,716	10
పూతలపట్టు	44	13,713	09
తవణంపల్లె	44	16,490	10
యాదమరి	45	14,293	09

ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు



ఒకప్పుడు ఎక్కడో దూరంగా ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి వేచి ఉండాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఇంటి ముందుకు వాహనాన్ని పంపిస్తున్నారు. దీంతో మేము సాఫీగా సరుకులు తీసుకుంటున్నాం. ఇంటింటికీ రేషన్ ఇబ్బంది లేకుండా ఉంది. ప్రభుత్వం ఇలాంటి సౌకర్యం కల్పించడంతో మాలాంటి మహిళలకు, వృద్ధులకు, దివ్యాంగులకు చాలా సంతోషంగా ఉంది.

– అరిమలమ్మ, మొగిలి

సకాలంలో సరుకులు



అధికారుల ఆదేశాల మేరకు సకాలంలో ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నాం. మాకు అప్పగించిన గ్రామాలకు ఎప్పుడు వచ్చేది ముందుగానే తెలియజేస్తాం. దీంతో వాహనం వచ్చిందని ముందుగానే తెలుసుకున్న లబ్ధిదారులు వచ్చి సరుకులు తీసుకెళతారు. మా ఆపరేటర్లకు జీవనోపాధి కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఇనాయతుల్లా, ఎండీయూ ఆపరేటర్, బంగారుపాళెం

పారదర్శకతకు పెద్ద పీట



పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తూకాల్లో మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటా ద్వారా సరుకులు తూకం వేసి పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా గడపగడపకూ నిత్యవసర సరుకులు అందజేస్తున్నాం. సకాలంలో నాణ్యమైన బియ్యం అందజేస్తున్నాం నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం.

– సుభద్రమ్మ, తహసీల్దార్, బంగారుపాళెం

వైఎస్సార్‌సీపీ బహిరంగ సభ రేపు

తవణంపల్లె: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఆదివారం ఉదయం వైఎస్సార్ సీపీ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు హరిరెడ్డి తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, మండల పార్టీ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని వివరించారు. మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యురాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీలు, మహిళలు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా డీఐఓ రవిరాజు పలు స్కానింగ్ కేంద్రాలపై దాడులు చేసి, రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ నిబంధనల మేరకు స్కానింగ్ చేస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో జయరాములు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పపై మొగిలీశ్వరుని తేజం





పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామి అమ్మవారు, విశేషాలంకారంలో మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి పుష్కరిణితో తెప్పలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షి సమేత స్వయంభు మొగిలీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి అలంకార మంటపంలో స్వామి, అమ్మ వారిని విశేషంగా అలంకరించి ఆలయ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై కొలువుదీర్చారు. ఆదిదంపతులైన పార్వతీ, పరమేశ్వరుడు తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి మొగిలి గ్రామానికి చెందిన గణేష్‌బాయ్స్, మొగిలీశ్వర ట్రాన్స్‌పోర్టు వారు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ఆలయ ఈఓ మునిరాజు మాట్లాడుతూ, ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు 11 రోజుల పాటు మొగిలి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయన్నారు. శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మవారు వివిధ వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారని చెప్పారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పర్యటన రేపు

బంగారుపాళెం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం బంగారుపాళెంలో పర్యటించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. బంగారుపాళెం–అరగొండ రోడ్డులోని పార్టీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సదస్సుకు హాజరు కానున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, అభిమానులు సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

పూతలపట్టు: ఎస్‌టీయూ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఇందులో కమిటీ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా జగదీశ్వర్ పిళ్లైను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గంటా మోహన్, పురుషోత్తం నాయుడు, దేవరాజురెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

గుడిపాల: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 16న ఎన్నికల నోటిఫికేషన్ రానున్న సందర్భంగా మండలంలో ఉన్న బ్యానర్లు, కటౌట్లను తొలగించాలన్నారు. గ్రామాల్లో కూడా ఎక్కడా ఎటువంటి పొరబాట్లు లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దార్ కల్యాణి పాల్గొన్నారు.

వేసవిలో కోతల నివారణకు చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో వేసవిలో కోతలు లేకుండా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం, జిల్లా స్టోర్స్, అర్బన్ ఈఈ కార్యాలయాలను పరిశీలించి మాట్లాడారు. 2019–20కు సంబంధించి పెండింగ్‌లో వర్క్‌ఆర్డర్లను ఈ నెలలోపు పూర్తి చేయాలని చెప్పారు. లేకపోతే ఏఈల జీతాల నుంచి సంబంధిత మొత్తాలను రికవరీ చేస్తామని హెచ్చరించారు. సూర్యఘర్ పథకాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని వినియోగించుకోవాలన్నారు. ఇంటి పైన సోలార్ పలకాలు అమర్చుకుంటే వాటి ద్వారా 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను వాడుకోవచ్చన్నారు. వీటిపై సబ్సిడీ, రుణం అందిస్తున్నట్లు వివరించారు. మరమ్మతు కేంద్రం పనులు దాదాపు పూర్తయిందని ఇక ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. సకాలంలో విద్యుత్ పరికరాలను రైతులకు అందించాలని సూచించారు. వేసవిలో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో అదనపులోడ్స్ ఉన్న చోట 63,100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఈ హరి, చిన్నబ్బ, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్, జగదీశ్వరనాయుడు, ఏఈలు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేద్దాం

పూతలపట్టు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గృహసారథులు, కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు కలిసి వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేయాలని ఆ పార్టీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి తెలిపారు. మండలంలోని పూతలపట్టు, తలపులపల్లి, గాండ్లపల్లి, బైటపల్లి పంచాయతీలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ కార్యకర్తల బంధువులకు మాత్రమే లబ్ధి చేకూరేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పంచాయతీలోని ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా వాళ్ల పంచాయతీ పరిధిలోనే సచివాలయాలను ప్రభుత్వం నిర్మించి ఇంటి వద్దే సేవలు అందిస్తోందని గుర్తుచేశారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బూత్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని తెలిపారు. ఎన్నికలకు 30 రోజులు మాత్రమే వుండడంతో పోలింగ్ బూత్‌పరిధిలోని ప్రజలకు ప్రభుత్వంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచులు మాసిలామణి, సుబ్రమణ్యం, రామతులసీ, ఎంపీటీసీ రాణెమ్మ, ఎంఎస్ మణి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, నాయకులు నిరంజన్ రెడ్డి, షణ్ముగం, బూత్ కమిటీ మెంబర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓతో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్



డీఆర్‌ఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌస్ మోహిద్దీన్

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్ మోహిద్దీన్ డీఆర్‌ఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉన్నతాధికారులను, డీఆర్‌ఓ పుల్లయను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో సరస్వతీ ఆలయం నిర్మించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భూమిపూజ చేశారు. పాఠశాలలో శుక్రవారం ఉదయం స్థపతి రమేష్ బాబు ఆధ్వర్యంలో సరస్వతి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం లలిత మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో సరస్వతి ఆలయం నిర్మించాలని ఉపాధ్యాయులు కోరగా, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి అందరం కలసి విరాళాలతో ఏర్పాటు చేసుకొని ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళెం ఎంఈఓ రమేష్‌బాబు, ఆలయ కమిటీ చైర్మన్ గోపి, సర్పంచ్ రాధాముని, ఎంపీటీసీ సభ్యులు దుర్వాసులు, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, కనకాచ్చారి, నరసింహారెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

బంగారుపాళెం: చదువుతోనే సమాజంతో గుర్తింపు వస్తుందని హెచ్‌ఎం సూజాత అన్నారు. మండలంలోని గువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించి పాఠశాలకు మంచిపేరును తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం





హాజరైన అక్కా చెల్లెమ్మలు, చెక్కును మహిళలకు అందజేస్తున్న సునీల్‌కుమార్, పార్టీ నాయకులు, అధికారులు

- చంద్రబాబు హామీలతో మహిళలు మోసపోకండి
- వైఎస్సార్ చేయూత కింద రూ.5.97 కోట్ల చెక్కు పంపిణీ
- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వెలుగు ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత పథకం కింద 3,183 మంది మహిళలకు రూ.5.97 కోట్ల చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ ప్రసంగిస్తూ మహిళా పక్షపాతి జగనన్న అన్నారు. మహిళలకు ఎన్నో పథకాలు అమలు చేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి బాటలు వేశారన్నారు. మహిళల కోసం అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా మహిళల ఖాతాలను జమ చేయడం ఆనందంగా ఉందన్నారు. కుల, మతాలు, పార్టీలకతీతంగా నవరత్నాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చిన జగనన్నను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సంక్షేమ సారథిని మరోసారి సీఎంగా చేసుకోవడానికి తాము సిద్ధమే అంటూ అక్క చెల్లెమ్మలు ముక్తకంఠంతో చెప్పారు. అనంతరం సీఎం చిత్ర పటానికి మహిళలతో కలసి క్షీరాభిషేకం చేయించారు.

ఆరు హామీలిస్తారట

చంద్రబాబు ఈ ఎన్నికల్లో మరో ఆరు హామీల పేరుతో మహిళల ఓట్లు దండుకోవడానికి వస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. టీడీపీ మాటలు నమ్మి మోసపోకండని సూచించారు. చంద్రబాబు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ములేక జనసేన, బీజేలతో పొత్తుల కోసం పాకులాడుతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు అందించిన జగనన్న సింహంలా ఒక్కడే ఎన్నికల రణరంగంలో దూసుకుపోతున్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు టీడీపీ నాయకుల ప్రలోభాలకు గురికాకుండా ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, సీసీలు, సిబ్బంది, ఈఓపీఆర్‌డీ కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ శరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, కిషోర్ రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, రవిరెడ్డి, పాలాక్షిరెడ్డి, సుజిత్‌రెడ్డి, మురుగన్, పరదేశి, యూత్ లీడర్లు, వలంటీర్లు, మండల సమాఖ్య లీడర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి

ఐరాల: సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి సీఎంగా చేసుకుందామని నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన మండలంలోని శుక్రవారం పేరయ్యగారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని కరపత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వానికి రాబోవు ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో వేసే ఓటును ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. కుల, మత, వర్గ భేదం లేకుండా ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్నామని తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి సీఎం అభయం

ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) అభయమిచ్చి ఆదుకుంటోందని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొలకలకు చెందిన అశ్విన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ మోహన్, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.